కథ

# వ్యక్తిత్వం లేని మనిషి

వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి

రిజిస్టర్‌లో సంతకం చేసి తల పై కెత్తిన భార్గవ ఎదురుగా నిలబడి ఉన్న వ్యక్తిని చూసి అప్రతిభు డయ్యాడు.

'దివ్య!' తా నెంతగా మరవాలన్నా మరచిపోలేకపోతున్న వ్యక్తి.

తన చేతకానితనానికి, తండ్రిని ఎదిరించలేని తన అసమర్థతకు బలయిన స్త్రీ. మరల ఆమెకు తన ముఖం చూపించవలసి వస్తుం దనుకోలేదు.

దివ్య భ్రుకుటి ముడివడింది. 'ఎవరబ్బా! తెలిసిన ముఖంలా ఉందే' అనుకుంటూ, వంగి రిజిస్టర్‌లో సంతకం చేసి లేచి చూసేలోపల అతను దూరంగా జరిగి తన వైపే చూస్తున్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది అత నెవరయిందీ. అసహ్యం, జుగుప్స, రోషం, ద్వేషం అన్నింటి మిశ్రమ భావావేశంతో ముఖం జేవురించింది. ముఖం తిప్పుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది ఆ కాలేజీకి కొత్తగా వచ్చిన లెక్చరర్ దివ్య.

భార్గవ కాలేజీలో ఉన్నంతసేపూ అన్యమనస్కంగానే ఉన్నాడు. సాయంత్రం ఇంటి కెళ్లిన భార్గవ మనసు పశ్చాత్తాపాగ్నితో దహించుకుపోతుంటే, బట్టలయినా మార్చుకోకుండా అలాగే హాల్లో సోఫాలో కూర్చుండిపోయాడు.

దుర్గ వచ్చి చూసి, మూతి మూడు వంకర్లు తిప్పి, "ఈ పూట పనిమనిషి రాలేదు. ఇక్కడెవరూ మీకు కాఫీలు పెట్టి అందించే దాసీలు లేరు. బయటే తాగి రండి! ఏ హొటల్లోనో తాగే వస్తుంటార్లే!" వాగ్బాణాలు సంధించి, పక్కింటి పంకజాక్షితో పుక్కిటి పురాణానికి హడావుడిగా వెళ్లింది.

మర్నాటి నుంచి వీలు దొరికినప్పుడల్లా పలకరించా లని ప్రయత్నిస్తున్నాడు భార్గవ. కాని అతని కా అవకాశ మివ్వడంలేదు దివ్య. పొరపాటున కూడా అతని వైపు చూడటం లేదు.

ఒకరోజు ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో వీ ళ్లిద్దరే ఉండటం తటస్థించింది.

"దివ్య గారూ! ఈ సంస్కార హీనుణ్ణి క్షమించండి - క్షమించమని అడగటానికి కూడా సిగ్గు పడుతున్నాను. కట్నం డబ్బు సమయానికి అందివ్వలేని మీ నిస్సహాయతను హేళన చేస్తూ మా నాన్నగారు నా రెక్క పుచ్చుకుని పెళ్లి పీటల మీద నుంచి లా క్కెళితే నిర్దయగా వెళ్లిన వ్యక్తిత్వం లేని అసమర్థుడిని." భార్గవ మాటలే కాదు, కళ్లు కూడా బాధను వ్యక్తం చేశాయి.

త లెత్తి భార్గవ కళ్లలోకి చూసిం దో క్షణ కాలం దివ్య. కాని అతని మీద ఎప్పటి నుంచో పేరుకుని ఉన్న ద్వేష భావం మాట్లాడనివ్వలేదు. తల దించుకుని పక్కకు తొలగి వెళ్లిపోయింది మాట్లాడకుండా.

మరో రోజు దివ్య శివాలయంలో దేవుడిని దర్శించుకుని వచ్చి బయట కూర్చుని ఉంటే ఎదురుగా వచ్చి కూర్చున్నాడు భార్గవ. కొబ్బరి చిప్ప పగలగొట్టి కొబ్బరిముక్క ఆమె కివ్వబోయాడు. ఆమె తీసుకోకుండా లేచి నిలబడింది వెళ్లడానికి ఉద్యుక్తురా లవుతూ.

"దేవుడి ప్రసాదం వద్దనకూడదు, తీసుకోండి!"

తలెత్తి భార్గవ కళ్లలోకి ఓ క్షణం చూసి, చేయి చాపి తీసుకుంది.


"ఏమండీ, దయ ఉంచి నేను చెప్పేది వినండి, ప్లీజ్!" ఎంతో అర్థింపు ధ్వనిస్తోంది భార్గవ మాటల్లో.

"ఇంకా వినడానికి ఏ ముందని, ఇన్నేళ్లకు? ఇప్పుడు?" ఎలాగో దివ్య గొంతు దాటి వచ్చాయి ఆ మాటలు.

"ఆ నాటి నుంచి నేను పడే మానసిక వేదన మీకు చెప్పుకుంటే గాని, నా మనసుకు శాంతి లభించ దండీ!" ఆలయ ఆవరణలోనే దూరంగా ఓ మూలగా ఉండే నందివర్ధనం చెట్టు దగ్గరకు దారి తీశాడు భార్గవ.

ఏ మనుకుందో, ఏమో మౌనంగా అనుసరించింది దివ్య.

"నా జీవితంలో సరిదిద్దుకోలేని తప్పులు రెండు చేశానండి! మొదటిది మిమ్మల్ని పెళ్లి చేసుకోకపోవడం, రెండోది దుర్గను చేసుకోవడం. రెండూ కూడా మా నాన్నను ఎదిరించలేని నా పిరికితనం మూలంగా సంభవించినవే. నేను మీకు చేసిన అన్యాయానికి ఆ తరువాత పశ్చాత్తాప పడని రోజు లేదు. మా నాన్న తను కోరినంత కట్నం తెచ్చిన దుర్గను నా మెడకు కట్టాడు. ఆమె డబ్బు అహంకారంతో నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుంది, నిష్కారణంగా సాధిస్తుంది, బాధిస్తుంది. మన శ్శాంతి లేకుండా పోతోంది. ఆమె మనస్తత్వ మేమిటో గాని, నేను ఎంత



ఓర్పుతో ప్రయత్నించీ ఆమెలో మార్పు తేలేకపోతున్నాను. నా సోదితోనే బోరు కొట్టిస్తున్నాను, మిమ్మల్ని గురించి ఏం అడగనే లేదు. అప్పుడు మీరు డిగ్రీ మధ్యలో నిలిపివేసి ఇంటి దగ్గరే ఉన్నా రనుకుంటాను.''

దివ్య అంతరాంతరాల్లో గడ్డకట్టి ఉన్న భార్గవ మీది ద్వేషం కరగసాగింది. ''అవునండీ ! అప్పుడు ఇంకా రెండు మూడు సంబంధాలు చూశారు మా నాన్నగారు. అందరూ కూడా పీటల మీద పెళ్లి ఆగిపోయిన పిల్ల మా కెందుకని వెళ్లిపోయారు. దాంతో వివాహం పట్లే విముఖత ఏర్పడింది నాకు. తర్వాత నిలిపివేసిన డిగ్రీ పూర్తి చేశాను, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. వెంటనే ఉద్యోగం దొరికింది.''

''అప్పటి నా ప్రవర్తన తలచుకుంటే నా పట్ల నాకే అసహ్యం కలుగుతోం దండీ !''

''నిజంగా ఇప్పు డాలోచిస్తే ఆ నాడు పెళ్లి ఆగిపోవడమే అదృష్టమేమో ననిపిస్తోంది. తాత్కాలికంగా అప్పటికి బాధ కలిగినా ఇప్పుడు నా స్వశక్తితో స్వతంత్రంగా జీవించగలుగుతున్నాను. అసలు ఆర్థిక లావాదేవీలతో ముడిపడిన వ్యాపారం లాంటి ప్రస్తుత వివాహ వ్యవస్థంటేనే నాకు అసహ్యం కలుగుతోంది.''

'కట్నానికి అమ్ముడుబోయిన నా కెక్కడుంది వివాహ వ్యవస్థ గురించి చర్చించే అధికారం? కాని, నా కారణంగా పెళ్లికి దూరమైన మీరు వివాహం చేసుకుంటేనే గాని నా మనసుకు ప్రశాంతత దొరకదు' - భార్గవ గొంతు దాటి బయటకు రాని భావం.

''వస్తా నండీ !'' అంటూ లేచి నిలబడింది దివ్య.

''రేపు నా పుట్టిన రోజు. మీరు తప్పక రావాలి'' అంటూ ఇంటి చిరునామా వివరంగా చెప్పాడు భార్గవ.

మర్నాడు దివ్య భార్గవ ఇంటికి వెళ్లామా, వద్దా అని సందిగ్ధంలో పడింది కొద్దిసేపు. చివరకు వెళ్లకపోతే బావుండదు, సంస్కార హీనంగా ఉంటుంది అనుకుని, ఓ చక్కని కానుక తీసుకుని బయలుదేరింది.

గేటుకు వేలాడుతున్న నేమ్ ప్లేట్ చూసి గేటు తీసుకుని లోపల కెళ్లింది. దివ్య రావడం లోపలనుంచే చూసిన భార్గవ నవ్వుతూ ఎదురు వచ్చి ''రండి, రండి !'' అంటూ ఆహ్వానించాడు.

సోఫాలో కూర్చుంటూ, 'ఇంకా ఎవరూ రాలేదు. తనే మొదటగా వచ్చిన అతిథి కాబోలు' అనుకుంది దివ్య.

సరిగ్గా ఆమె భావం గ్రహించినట్లు - ''ఈ సారి నా పుట్టిన రోజుకు మీరు ఒక్కరేనండీ ఆహ్వానితులు. అసలు నా పెళ్లయిన తర్వాత పుట్టినరోజులే మరిచిపోయాను'' అన్నాడు భార్గవ.

''మీ శ్రీమతి ఏదీ?'' అంది లోపలకు చూస్తూ దివ్య.

''ఓఁ, సారీ! మీకు పరిచయం చేయలేదు కదూ! పిలుస్తాను. దుర్గా! దుర్గా!'' గట్టిగా పిలిచాడు భార్గవ.

''చంద్రా! ఆలస్యంగా ఇంటికొచ్చావేమిటి?'' గద్దిస్తూ అడిగాడు తండ్రి.

''మా మాస్టారు నిద్రపోయారు నాన్నా!'' వినయంగా జవాబిచ్చాడు కుమారుడు.

''మీ మాస్టారు నిద్రకు నీ ఆలస్యానికి లింకేవిట్రా'' చిరాకుపడ్డాడు తండ్రి.

మా మాస్టారు నిద్రలేస్తేనే కదా నన్ను నిద్రలేపేది?

చంద్రమోహన్,

''ఆఁ! ఏమిటి అంతలా గావుకేక లేస్తున్నారు?'' అక్కడ కొత్త వ్యక్తి ఉందన్న సంకోచం లేకుండా అంది దుర్గ హాల్లో అడుగు పెడుతూనే.

దుర్గ దూకుడుకు అలవాటు పడి ఉన్న భార్గవ ఆమె మాటలు పట్టించుకోకుండా - ''వీరు దివ్య గారు! ...'' భార్గవ మాట పూర్తి కాకముందే అందుకుంది దుర్గ - ''ఇప్పుడు మీ రేం కొత్తగా చెప్పనక్కరలేదు లెండి! పెళ్లయిన నాటి నుంచి నిత్యం మీరు జపిస్తూండే పేరేగా!''

దుర్గ నమస్కారం చేయకపోయినా, దివ్య ''నమస్కార మండీ!'' అంది.

కనీసం ప్రతి నమస్కారం చేసే సభ్యత కూడా పాటించకుండా విసవిసా లోపల కెళ్లింది దుర్గ.

భార్గవ మొహాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. ''చూశారు కదూ! మీకు నేను చేసిన ద్రోహానికి నాకు పడిన శిక్ష!'' ఏడవలేక నవ్వాడు.

ఆ వాతావరణంలో ఏం మాట్లాడాలో అర్థం కాక ఇబ్బందిగా సోఫాలో కదిలింది దివ్య.

''సారీ, దివ్య గారూ! మిమ్మల్ని ఇంటికి పిలిచి అవమానించాను. నా ఇల్లాలి సంగతి తెలుసుండీ, మిమ్మల్ని ఇంటికి ఆహ్వానించి పొరపాటు చేశాను.'' భార్గవ చాలా బాధపడ్డాడు.

''నో! నో! అలాంటి దేం లేదు. ఇందులో అవమానపరచడ మే ముంది?'' అనేసి తన హేండ్ బాగ్ లోంచి చక్కగా ప్యాక్ చేసి ఉన్న కానుక తీసి ఇచ్చింది - ''మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'' అంటూ.

దివ్య వెళ్లేంతవరకు పడక గదిలోంచి బయటకు రాలేదు దుర్గ.

అప్పటిదాకా బిగపట్టుకుని ఉన్న ఆగ్రహం కట్టలు తెంచుకుని బయటకు ఉరికింది - ''పశువా! ఇంటి కొచ్చిన మనిషిని మర్యాదగా పలకరించడం పోయి, అవమానపరుస్తావా? సంస్కారం లేనిదానా!'' విరుచుకుపడ్డాడు భార్గవ.

''మాటలు సరిగా రానివ్వండి! నే నేం చేశా నని అలా విరుచుకు పడతారు? ఆ దేవతతోనో మీరు ఊరేగుతూ ఉంటే చూస్తూ మీకు సేవలు చేయాలా నేను?'' ఈటెల్లాంటి మాటలు విసరడంలో దుర్గ వెనుకాడలేదు.

భార్గవ కోపం అదుపు తప్పింది. ''ఎంత మాటన్నావే! ఆమె కాలి గోటికి సరి రావు నీవు, రాస్కెల్!'' అంటూ చెంప మీద కొట్టాడు.

ముక్కుపుటా లెగరేస్తూ, చీదేస్తూ ''కొట్టారు కదూ! మీ ఆటలు సాగనివ్వలే దని ఇంత పని చేస్తారా? ఇక ఒక్క క్షణం ఇక్కడ ఉండను'' అంటూ ఏడుస్తూ, తిడుతూ సూట్‌కేసు సర్దుకుని అమ్మగారింటి కెళ్లింది.

మర్నాడు కాలేజీలో దివ్యకు మొహం చూపడానికి సిగ్గనిపించింది భార్గవకు. దివ్యే విష్ చేసింది. భార్గవ ఇంట్లో అతని పరిస్థితి కళ్లారా చూసి నప్పటి నుంచి దివ్యకు అతని పట్ల సానుభూతి కలగసాగింది. అతని మనసులో తనకున్న స్థానానికి కించిత్తు సంతోషమూ కలిగింది.

రోజులు గడిచే కొద్దీ ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరగసాగింది. వ్యక్తిగత విషయాలు ఒకరితో ఒకరు చెప్పుకునే స్థితికి వచ్చారు.

''భార్గవ గారూ! మీ రీ మధ్య చాలా సన్నబడ్డారు. జబ్బు పడి లేచినవాడిలా ఉన్నా రేంటి?''

''హొటలు భోజనం, కదండీ!'' నవ్వేశాడు భార్గవ.

''మీ శ్రీమతి ఎప్పు డొస్తుందట?'' అడిగింది.

''ఇక రాదటండీ! విడాకులు ఇస్తుందట! లాయర్ నోటీసు ఇచ్చింది.'' చెప్పాడు భార్గవ అర్థం కాని న వ్వొకటి నవ్వి.

తర్వాత కాలేజీ కబుర్లు, అవీ, ఇవీ మాట్లాడుకున్నారు. కాని ఏం మాట్లాడుతున్నా భార్గవ అన్యమనస్కంగా ఉన్న ట్లనిపించింది దివ్యకు.

''ఈ మధ్య మీరు ఏదో మాట్లాడబోయి, మ రేదో మాట్లాడుతున్న ట్లనిపిస్తోందండీ! మీ భార్య విడాకుల నోటీ సివ్వడంతో బాగా దెబ్బతిన్నట్లున్నారు. ఒకసారి మీరు వా ళ్లింటికి వెళ్లి రండి!''

''నో, నో! అ దేం కాదండి. విడాకులకు నేనూ సిద్ధపడి ఆ ప్రయత్నంలోనే ఉన్నాను.

అని, కొద్దిసేపు తటపటాయించి మళ్లీ అన్నాడు - ''మీ రే మనకోను అంటే ... మిమ్మల్ని అడిగే ధైర్యం చేయలేక నాలో నేను మధన పడుతున్న దేమిటో చెపుతా ను.''

''ఊఁ, చెప్పండి.''

''నేను ... మిమ్మల్ని వివాహం చేసుకోవా లనుకుంటున్నాను, మీకు అంగీకారమయితే!''

దివ్య మొహం కందగడ్డలా అయింది. రోషంతో జేవురించింది. భార్గవ ఇలా అడుగుత డని ఊహించలేదు. వచ్చే కోపాన్ని నిగ్రహించుకుంటూ అంది - ''తండ్రి నెదిరించలేని పిరికితనంతో, పెళ్లి పీటల మీద నుంచి లేచిపోయావు ఆనాడు. భార్య విడిపోతా నంటోంది కనుక మళ్లీ పెళ్లి పీటల మీదకు రమ్మంటున్నావు ఈనాడు. నాడూ, నేడూ, ఎప్పుడూ వ్యక్తిత్వం లేని మనిషివే నీవు! మ రెప్పుడూ నాతో మాట్లాడేందుకు కూడా ప్రయత్నించకు!'' ఒక్క ఉదుటున లేచి చరచరా వెళ్లిపోయింది దివ్య.

★